క్లుప్తంగా

నేడు వినుకొండలో ప్రక్షాళన పూజలు

వినుకొండ: తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లడ్డు వివాదంపై రాజకీయం చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించినందుకు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రక్షాళన పూజా కార్యక్రమం శనివారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతోపాటు, పార్టీ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: నాదెండ్ల విద్యుత్‌సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయం, సినిమాహాల్ సెంటర్, ఎస్సీ కాలనీ, ఇండస్ట్రీస్‌కు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

నేడు యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

నాదెండ్ల: యడ్లపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనిమి రెడ్డి తెలిపారు. ఎంపీపీ ఝాన్సీ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

ఉచిత గ్రహణ మొర్రి వైద్య శిబిరం

నరసరావుపేటరూరల్: సమగ్రశిక్ష, బసవ తారక చారిటబుల్ ట్రస్ట్, క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉచిత గ్రహణ మొర్రి మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ రాజేష్, డాక్టర్ జోషిలు క్యాంప్‌లో పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏడుగురు చిన్నారులకు శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడంతో పాటు రవాణా ఖర్చులు అందజేస్తారని రాష్ట్ర సహాయ సమన్వయకర్త జి.మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సమన్వయకర్త ఆర్.సెల్వరాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఈఎస్‌గా రవీంద్ర బాధ్యతలు

నరసరావుపేట టౌన్: నరసరావుపేట ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ (ఏఈఎస్)గా రవీంద్ర శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఏఈఎస్‌గా పనిచేస్తూ బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ అక్రమ మద్యం, నాటుసారా నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఇప్పటి వరకు ఇక్కడ ఈఎస్ గా పనిచేసిన షేక్ ఖాజా మొహిద్దీన్‌ను ఒంగోలుకు బదిలీ చేయగా ఆయన స్థానంలో నంద్యాల డీపీఈవోగా విధులు నిర్వహిస్తున్న కె.మణికంఠను నియమించిన విషయం తెలిసిందే. గురువారం మణికంఠ బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నాదెండ్ల: స్వర్ణాంధ్ర ఫౌండేషన్ 2047లో భాగంగా శుక్రవారం యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. వక్తృత్వంలో సింగిల్స్ పోటీల్లో యశస్వి (లింగారావుపాలెం), లిఖితసాయి (ఉన్నవ), సానియామీర్జా (జగ్గాపురం), వక్తృత్వం టీమ్‌లో యశస్వి (లింగారావుపాలెం), మోహన్‌అర్చన (లింగారావుపాలెం), ఎం.రాజు, కె.మనోహర్ (కారుచోల) మూడో బహుమతి గీతాశ్రీలక్ష్మీ, వెన్నెల (సొలస), వ్యాసరచనలో వేణుమాధవ్ (ఉన్నవ), గీతాశ్రీలక్ష్మి (సొలస) సాయికృష్ణ (జగ్గాపురం) బహుమతులు సాధించారు.

సొమ్ము చెల్లించకుంటే రికవరీ యాక్ట్ అమలు



నాదెండ్ల: నేషనల్ హైవే బైపాస్ నిర్మాణానికి భూసేకరణ చేసిన సమయంలో ప్రభుత్వం చెల్లించిన అదనపు పరిహారం సొమ్మును 15 రోజుల్లో ఖజానాకు జమచేయకుంటే చట్టప్రకారం రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేస్తామని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. గణపవరం గ్రామానికి చెందిన రైతు బి.వెంకటేశ్వర్లుకు గతంలో ప్రభుత్వం అదనపు పరిహారం చెల్లించిందని, ఆయన మృతి చెందినందున ఆయన వారసురాలైన భార్య నాగేంద్రమ్మ పరిహారం సొమ్ము తిరిగి జమ చేయాలన్నారు. ఇప్పటికే వారికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతో రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గణపవరం గ్రామంలోని సంబంధిత రైతు పొలంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది బోర్డును ఏర్పాటు చేశారు.

లింగంగుంట్లలో స్వచ్ఛతా హి సేవ

నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్, ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, పీడీ ఝాన్సీ, టీడీపీ నాయకులు గంగుల పెద్దిరెడ్డి పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరు పచ్చదనం-పరిశుభ్రతను పాటించాలని వారు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటి సంరక్షణకు చేపట్టాలని తెలిపారు.

ఏం పాపం చేసిందని కూల్చారు?!

- పూర్తిగా నేలమట్టమైన ఎన్‌జీవో పార్కు ధ్యానవేదిక
- ప్రహరీని సైతం వదిలిపెట్టని వైనం
- మాకేం తెలియదని మున్సిపల్ అధికారుల బుకాయింపు
- గతంలో మున్సిపల్ కమిషనర్ క్వార్టర్‌కు కేటాయించిన స్థలం
- కౌన్సిల్‌లో ఈ మేరకు తీర్మానం
- విధ్వంసకారులపై ఫిర్యాదు చేయని వైనం



ఎన్‌జీవో కాలనీలోని కోడెల ఉద్యానవనంలో ధ్యాన వేదిక పూర్తిగా తొలగించి అడ్డుగా ఉన్న పార్కు గోడను సైతం పడేసిన దృశ్యం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కలెక్టర్, ఎస్పీలు ఉండగా అధికారంలో ఉన్న టీడీపీ వర్గీయులు అధికారులను పట్టించుకునే పరిస్థితి కన్పించటం లేదు. అధికారులకు ఏమాత్రం తెలియకుండా, ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఎన్‌జీవో కాలనీలోని కోడెల ఉద్యానవనం (మున్సిపల్ పార్కు)లోని ధ్యాన వేదికను తొలగించటంతో పాటు పార్కు గోడను సైతం 15 అడుగుల మేర కూల్చివేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ముందుగా అనుమతి లేకుండా వేదిక తొలగించటం, గోడను సైతం తొలగించిన సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడటం గమనార్హం.

క్వార్టర్ స్థలంలో ధ్యాన వేదిక

ధ్యాన వేదిక ఉన్న స్థలం మున్సిపల్ కమిషనర్ కోసం నిర్మించాల్సిన క్వార్టర్ స్థలమనే విషయం వెలుగులోకి వచ్చింది. 2000 నుంచి 2004 మధ్య జోగేశ్వరమ్మ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఎన్‌జీవో కాలనీలో అభయాంజనేయ స్వామి దేవాలయంకు ఎదురుగా ఉన్న ధ్యానవేదికను తొలగించిన ఆరుసెంట్ల స్థలాన్ని మున్సిపల్ క్వార్టర్ నిర్మించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అయితే క్వార్టర్ నిర్మాణం జరగలేదు. ఆ తర్వాత దానిపక్కనే ఉన్న స్థలాన్ని పార్కుకు కేటాయించటంతో ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని సైతం పార్కులో కలిపేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఈ స్థలంలో పార్కుకు వచ్చే వారు ఆసనాలు, ధ్యానం చేసుకునేందుకు వేదికను నిర్మించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో అనేక కాంట్రాక్ట్ పనులు చేసి చేతినిండా సంపాదించిన కాలనీకి చెందిన టీడీపీ వర్గీయుడు ఒకరు ఇప్పుడా వేదికను తొలగించి దాని స్థానంలో తన సొంత నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేసేందుకు పూనుకొని దివంగత స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రారంభించిన వేదికను తొలగించారు. ఈ చర్యను అదే ప్రాంతానికి చెందిన టీడీపీలోని కొంతమంది వ్యతిరేకిస్తున్నారు.

ఫిర్యాదు చేయడంపై ఆలోచిస్తున్నాం

సంఘటనా స్థలాన్ని ఉదయమే పరిశీలించి వచ్చా. మాకు తెలియ చేయకుండానే జరిగిపోయింది. మా వద్ద అనుమతులు ఏమీ తీసుకోలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పరిశీలిస్తున్నాం. ఇటువంటి పనులు ఎవరూ చేయకూడదు.

–ఎం.జస్వంతరావు, కమిషనర్

ప్రజాప్రతినిధులకు విలువ ఏదీ?

- వినుకొండ కౌన్సిలర్ల ఆవేదన
- వార్డుల్లో ప్రజలకు ముఖం చూపించలేకుండా ఉన్నాం
- పురపాలక సమావేశంలో ఆందోళన



సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్మన్ దస్తగిరి



చైర్మన్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

వినుకొండ(నూజెండ్ల): వార్డుకౌన్సిలర్లుగా ఉండి కూడా వార్డుల్లో చిన్నచిన్న సమస్యలుకూడా పరిష్కరించలేక పోతున్నామని పురపాలకసంఘం సాధారణ సమావేశంలో వార్డుకౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి ఆధ్యక్షతన జరిగిన నిర్వహించిన సాధారణ సమావేశంలో వార్డుకౌన్సిలర్లు చైర్మన్ దస్తగిరిని ప్రశ్నించారు. కౌన్సిలర్లుగా ప్రజామద్దతుతో గెలిచిన మాకు విలువలేకుండా పోయిందని ప్రజలు అడిగిన చిన్నసమస్యలు కూడా పరిష్కరించలేకపోతున్నామని పట్టణంలో ఎలాంటి అభివృద్ధిపనులు జరుగటంలేదని వాపోయారు. పురపాలక సంఘంలో నిధులులేవాని ప్రశ్నించారు. దీంతో చైర్మన్ కౌన్సిల్ సభ్యులకు సమాధానం ఇస్తూ గతంలో మున్సిపాలిటీలో ఉన్న నిధులు మొత్తం ఖర్చుచేశామని, అందువల్ల ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు లేవన్నారు.

దీంతో కౌన్సిల్ సభ్యులు అసలు నిధులు ఏమైయ్యాయని ప్రశ్నించగా గతంలో కౌన్సిల్ సభ్యుల ఆమోదం మేరకే నిధులు ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఖర్చు చేశామని ప్రస్తుతం ప్రభుత్వంలో మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో అవసరమైన పనులు చేయడానికి కౌన్సిల్ ఆమోదం కోసం ఎజెండాలో పొందుపరిచామన్నారు.

పదవికి విలువలేకుండా పోయింది

ప్రజాప్రతినిధులుగా గెలిచిన తమకు విలువ లేకుండా పోయిందని కౌన్సిల్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎలాంటి పనులు వార్డుల్లో చేపట్టలేక పోయామని కౌన్సిలర్లు చెప్పిన సమస్యలు పరిగణలోకి తీసుకుని సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఉన్న కొద్ది విలువా పోతుందని కౌన్సిల్ సభ్యులు చైర్మన్‌కు తమ సమస్యలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు సుభాష్ చంద్రబోస్‌లతోపాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

భూములకు నష్టపరిహారం చెల్లిస్తాం

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, మాచవరం గ్రామాల గుండా నకరికల్లు అడ్డరోడ్డు నుండి చీరాల ఓడరేవు వరకు నిర్మించనున్న నాలుగులైన్ల (167ఏ) జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న యజమానులతో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనూరే సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంగా రిజిస్ట్రేషన్ వ్యాల్యూపై అధికంగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. 81.6 కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నట్లు వారు తెలిపారు.

రైతుల భూములకు సంబంధించిన యాజమాన్య హక్కు పత్రాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూములు కోల్పతున్న రైతులు తమ భూములకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. రైతుల అభ్యర్థనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారి సరోజిని, తహసీల్దార్ బండి నిర్మల, సర్వేయర్‌లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాదెండ్ల: ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ ప్రకారం ఆహారం అందించాలని, ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. యడ్లపాడు మండలం, వంకాయలపాడు గ్రామ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఇటీవల 67 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో వసతులు సరిగ్గా లేవని గోడ దూకి కొండల్లోకి పారిపోయిన ఉదంతం సంచలనం రేపిన విషయం విదితమే. స్థానిక నాయకులతో కలిసి గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌లతో మాట్లాడుతూ, పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులంతా క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలన్నారు. నెలరోజుల వ్యవధిలో పరిస్థితులు చక్కబడకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

విచారణ నుంచి డీఎస్పీని తప్పించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు

నరసరావుపేట: చిలకలూరిపేట రూరల్ మండలం యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని కూల్చి, కులం పేరుతో దూషించి అవమానపర్చిన నిందితులపై బాధితులు పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్న డీఎస్పీని ఈ కేసు పరిధి నుంచి తప్పించి మరొక నిజాయితీగల అధికారితో విచారణ చేపించి బాధితులకు న్యాయం చేయాలని కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు.

శుక్రవారం పట్టణంలోని ఎన్జీవోహోంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, గుంటూరు నగర కార్యదర్శి ఎన్.పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, చైతన్య గ్యాస్ వర్కర్ యూనియన్ నాయకులు చలపతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు సీతారాం ఏచూరి సంస్మరణ సభ

నరసరావుపేట: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఇటీవల మృతిచెందిన సీపీఎం అగ్రనాయకుడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దీనికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఏ.గఫూర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. దీనికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులను వక్తలుగా ఆహ్వానించామన్నారు. కావున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు డి.శివకుమారి, శిలార్, కామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

నడవండి.. గెలుచుకోండి..!



వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మహాత్మా గాంధీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తారీకున కోడెల శివప్రసాద్ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 5 కె వాక్‌లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో 5కె వాక్ బహుమతులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హృదయ సంబంధిత వ్యాధులపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, ఆయా సమస్యలపై డాక్టర్ల సలహాలు, సూచనలను పాటించాలని ఆయన కోరారు. మహాత్మా గాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

–నరసరావుపేట

మహిళకు మెరుగైన వైద్యసేవలు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పాము కాటుకు గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన కుమ్మరి సునీత వరి నాట్లు పనులు నిమిత్తం పొలంలో పనులు చేస్తుండగా విషసర్పం కాటు వేసిందన్నారు. పాము కాటుకు గురైనా సదరు మహిళ విషయాన్ని తక్షణమే సహచర కూలీలకు సమాచారం ఇవ్వగా సత్వరమే స్థానిక ఆరోగ్య కేంద్రానికి మహిళను తీసుకొని వచ్చారు. వైద్యశాల్లో పాముకాటుకు సంబంధించి వైద్యసేవలు సత్వరమే చేయగానే ప్రాణపాయస్థితి నుంచి బయట పడినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం పాముకాటుకు గురైన మహిళతో వైద్యాధికారి రాధాకృష్ణన్ మాట్లాడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు సహచర కూలీలు ఊపిరి పిల్చుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించినందుకు స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ప్రమీలను వైద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు.

ఎంపీడీవో కృష్ణకుమారి బాధ్యతలు స్వీకరణ



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఎంపీడీవోగా టీవీ కృష్ణకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కృష్ణకుమారిని నరసరావుపేట మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఉదయం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎంపీడీవోగా కృష్ణకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలువురు టీడీపీ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

నాదెండ్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా స్వరూపారాణి



స్వరూపారాణి

నాదెండ్ల: నాదెండ్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎస్ స్వరూపారాణి బాధ్యతలు చేపట్టారు. ఈమె అచ్చంపేట మండలం నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న జాకీర్ హుస్సేన్ బదిలీపై యడ్లపాడు మండలానికి వెళ్ళారు. అక్టోబర్ 1న వీరు బాధ్యతలు చేపట్టనున్నారు.

వినుకొండ ఆర్టీసీ డీఎంగా నాగేశ్వరరావు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జె.నాగేశ్వరరావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నందికొట్కూరులో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా వినుకొండ డిపోకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన డీఎం నాగేశ్వరరావును కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు గుర్రం జాషువా గృహ సందర్శన

వినుకొండ (నూజెండ్ల): కవి కోకిల గుర్రం జాషువా జయంతి సందర్భంగా వారి స్వగ్రామం చాట్రగడ్డపాడులోని జాషువా గృహ సందర్శన యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, ఉమ్మడి గుంటూరు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు కేజే రమేష్ తెలియజేశారు. ఈ యాత్రలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.భవానీ దేవి, ప్రధానకార్యదర్శి ప్రముఖ రచయిత చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి శ్రీనానా తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభోత్సవం



ఆర్వోప్లాంటు ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే

శావల్యాపురం: శుద్ధి చేసిన తాగునీటి విప్లవంలో బాల వికాస్–ఐరాడ స్వచ్ఛంద సంస్థలు సేవలు అభినందనీయమని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు (ఎంపీ) లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. శుక్రవారం మండలంలోని కనమర్లపూడి, ముంద్రువారిపాలెం గ్రామాల్లో బాలవికాస్–ఐరాడ స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ప్రారంభోత్సవం చేశారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సర్పంచులు తన్నీరు అంకారావు, పాపసాని విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, బాలవికాస్ ప్రతినిధులు శింగారెడ్డి శౌరిరెడ్డి, మధుసూదనరెడ్డి,అబ్బులు, బోడెపూడి శంకరు, గోరంట్ల హనుమంతరావు, యరమాసు కోటేశ్వరరావు, తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రమజీవుల అభ్యున్నతి కోసం పాటుపడిన బర్దన్



బర్దన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

చిలకలూరిపేట: శ్రమజీవుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన గొప్ప నేత ఏబీ బర్దన్ అని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ శత జయంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఐ పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసి పార్టీ భావజాల వ్యాప్తి కోసం కృషి చేశారని కొనియాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బర్దన్ సలహాలు, సూచనల మేరకు అప్పటి ప్రభుత్వం ఎంతో గౌరవించి పార్లమెంటులో కొత్త చట్టాలు తీసుకురావడం జరిగిందన్నారు. నాటి ప్రభుత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకం కోసం తీవ్రమైన కృషి చేసిన వారిలో బర్దన్ ఒకరని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పేలూరి రామారావు, తాళ్లూరి బాబురావు, తన్నీరు వెంకటేశ్వర్లు, మేకపోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలంటూ నిరసన

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: రీ–సర్వే, ఎల్పీ నెంబర్ల కేటాయింపును అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన జొన్నలగడ్డ సర్వేయర్ రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టర్లను ప్రదర్శిస్తూ ధర్నాచేసి తహసీల్దార్ కె.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రీ సర్వే, ఎల్పీ నెంబర్ల లోపాలు సరిదిద్దుతామని, రికార్డులు పరిశీలించాలని మండల సర్వేయర్, వీఆర్వోలను ఆదేశించారు. రికార్డులు పరిశీలించి, హక్కుదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని పలువురు సర్వేయర్లు, వీఆర్వోలు ఇదే విధంగా అక్రమాలకు పాల్పడ్డారని, వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఎంసీపీఐ యు మహిళా జిల్లా అధ్యక్షురాలు గాదె కుమారి, పౌరహక్కుల సంఘ జిల్లా జాయింట్ సెక్రెటరీ శిఖినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోరం లేదని...



మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి శుక్రవారం సభ్యులు హాజరు కాకపోవటంతో వాయిదా పడింది. సాధారణ సర్వసభ్య సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండల పరిషత్ పరిధిలో ఉన్న 18 మంది ఎంపీటీసీలతో పాటు కోఆప్షన్ సభ్యునితో పాటు మిగిలిన సభ్యులందరికీ కూడా సమావేశం సమాచారం ఏజెండాను తెలియపరిచారు. అయితే సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కాగా ఎంపీపీ, అధికారులు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవటంతో గంట పాటు సమావేశాన్ని వాయిదా వేశారు.

–రొంపిచర్ల